క్లుప్తంగా

రోడ్డు విస్తరణ బాధితులతో నేడు సమావేశం

కోస్గి: పట్టణంలోని రామాలయం చౌరస్తా నుంచి సయ్యద్ పహాడ్ దర్గా వరకు చేపట్టిన రోడ్డు విస్తరణలో ఇళ్లు, ఇతర ఆస్తులు కోల్పోయిన బాధితులతో శనివారం ఉన్నతాధికారుల సమక్షంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ శ్రీనివాసులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9:30 గంటలకు నిర్వహించే సమావేశానికి ఆర్డీఓ, అర్‌అండ్‌బీ ఈఈతో పాటు ఇతర అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి బాధితులు విధిగా హాజరు కావాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మరికల్: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్‌ను ఎంఈఓ మనోరంజని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు నవీన్, గోవర్ధన్‌రెడ్డి, తిరుపతయ్య, బాలనారాయణ, నాగరత్నమ్మ, శ్రీనివాస్, రాంరెడ్డి, నర్సింహులు, లక్ష్మయ్య, శ్రావణి, ముస్తాఫా పాల్గొన్నారు.

యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



నారాయణపేట: అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన గొల్ల బాలప్పను శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పూలమాల, శాలువాలతో జాతీయ, రాష్ట్ర నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. నారాయణపేట ప్రాంతంలోని యాదవులకు ఎలాంటి సమస్య వచ్చినా వెన్నంటి ఉంటామన్నారు. కార్యక్రమంలో గోపాల్ యాదవ్, చెన్నప్ప యాదవ్ పాల్గొన్నారు.

23వ రోజుకు చేరిన సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె



నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె 23వ రోజుకు చేరింది. శుక్రవారం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమ్మె శిబిరంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాక్ అధ్యక్షుడు ఎల్లాగౌడ్ మాట్లాడుతూ.. సమ్మెను నిరూపగించకుండా ఉండేందుకు అధికారులు యత్నిస్తున్నారని అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెకు తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో హరీశ్, సలీం, అనిల్, నరేశ్, విజయలక్ష్మి, శశిధర్, శివలీల, రాధ పాల్గొన్నారు.

దడవాయి సంఘం అధ్యక్షుడిగా వెంకటేష్

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో పనిచేస్తున్న దడవాయిలు శుక్రవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా జి.శ్రీనివాస్ కార్యదర్శిగా కె.రమేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం

అమరచింత: రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అయాచితం అన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సూచనల మేరకు శుక్రవారం అమరచింత పెద్దచెరువు ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నీటి తీరువా పాలు చక్కగా పనిచేశాయని.. వీటిని గత ప్రభుత్వాలు ఆదరించక పోవడంతో మరుగున పడ్డాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సాగునీటి సంఘాల బలోపేతానికి శ్రీకారం చుట్టారన్నారు. దీంతో ఆయా గ్రామాల చెరువుల్లోని నీటిని రైతులు పుష్కలంగా వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పోసిరెడ్డి విష్ణు, హన్మంతు నాయక్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణా మండలం ముడుమాల్ గ్రామంలో..



ఊట్కూరు తహసీల్దార్ కార్యాలయంలో..



కోస్గిలో నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సావిత్రిబాయి సేవలు చిరస్మరణీయం

ఘనంగా తొలి మహిళా ఉపాధ్యాయురాలి జయంతి

సాక్షి నెట్‌వర్క్: దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా సావిత్రిబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని భరత కేంద్రంలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

■ మక్తల్‌లో పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా పలు సంఘాల ఆధ్వర్యంలో గురుకులాలు, పాఠశాలల్లో సావిత్రిబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాములు, పీఈటీ గోపాలం, నాయకులు భాస్కర్, శ్రీనివాస్, కృష్ణ, పృథ్వీరాజ్, సురేష్, వరదరాములు, బందారు శేఖర్, హన్మంతు బాలకృష్ణ, సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

■ కోస్గి ఎమ్మార్సీ భవనంలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఓం ప్రకాశ్ ఆధ్వర్యంలో మహిళా టీచర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్ నాయక్, టీపీసీసీ/టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివరాములు, రఘునాథ్‌రెడ్డి, రాములు, భీమప్ప, సాయప్ప, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

■ కృష్ణా మండల కేంద్రంతో పాటు ముడుమాల్, కున్సి పాఠశాలల్లో సావిత్రిబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా టీచర్లను సన్మానించారు. ముడుమాల్‌లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తిమ్మప్ప, మహదేవ్, రాము, భారతి, ఓబులేష్, మారెప్ప, లంగప్ప, శ్రీను పాల్గొన్నారు.

■ నర్వలోని బీసీ భవనంలో సంఘం అధ్యక్షుడు సుదీర్ సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయికోడ్, కల్వాల్, పాత ర్లేడ్, పెద్దకడ్మూర్ పాఠశాలల్లో మహిళా టీచర్లను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో నాయకులు రవి, ఫజల్, హన్మంతు రెడ్డి, మల్లేష్, హనుమంతు, వెంకటయ్య, భాజావటిల్ పాల్గొన్నారు.

■ మరికల్ బాలుర ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ మనోరంజని, హెచ్‌ఎం నాగరత్నమ్మ పాల్గొన్నారు.

■ మాగనూర్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, వేణుగోపాల్, రామచంద్రాచారి, నాగేష్, శంకర్, జమ్మన్న, మురళీధర్‌రెడ్డి, భాజురెడ్డి, స్పందన, ఆజ్రా ఫాతిమా, రవీంద్రమ్మ, ఇందు, రాజీ, అనిత, మహేశ్వరి పాల్గొన్నారు. అదే విధంగా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ ధన్వాడ బాలికల ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి జయంతిని విద్యాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి బాలరాజు, నర్సింహులు, రాజు, బాలరెడ్డి, శివరాములు, వెంకటేష్, రాజు, నవీన్, సంధ్యారాణి, తులసమ్మ, శ్రావణి, అంజయ్య, నీలప్ప పాల్గొన్నారు.

■ ఊట్కూరు తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలల్లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, దుర్గం శ్రీనివాస్, శంకర్, లింగం, అధ్యాపకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

■ కొత్తపల్లి మండలం నిడ్జింత ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా టీచర్లను శాలువా లతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మక్తల్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ధన్వాడలో..



మాగనూర్‌లో..



నర్వ బీసీ భవనంలో..



కోస్గిలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం..



కొత్తపల్లి మండలం నిడ్జింత ఉన్నత పాఠశాలలో..



మరికల్‌లో..

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కోస్గి: మండలంలోని పలువురికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి అందజేశారు. ముశ్రీఫా గ్రామానికి చెందిన బాధితులకు రూ. 2.27 లక్షల సీఎం సహాయనిధి మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యాసాగర్, వెంకటేశ్వర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, రాంచంద్రారెడ్డి, అఫ్రోజ్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన అధికారులు



నారాయణపేట: నూతన సంవత్సరం సందర్భంగా శుక్రవారం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్‌ను జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీకి పూలమొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, సీఐ నర్సింహా, ఆర్ఎస్ఐ రాములు, ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య తదితరులు ఉన్నారు.

సాగు సౌకర్యాల కల్పనకు నిధులు

మాగనూర్: ప్రధానమంత్రి అనుసూచిత జాతి ఉద్ధరణ యోజన కింద కేటాయించిన ఎస్సీ భూముల్లో సాగు సౌకర్యాలు కల్పించడానికి అవసరమైన నిధులు ఉన్నట్లు ఎంపీడీఓ రహ్మతుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2021–22 సంవత్సరంలో వందశాతం సబ్సిడీతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఎస్సీ రైతులకు కేటాయించిన భూముల్లో సాగు సౌకర్యాలు కల్పించడానికి అవసరమైన ప్రతిపాదనలను ఎంపీడీఓ కార్యాలయానికి పంపాలన్నారు. లబ్ధిదారుడు రెండెకరాలకు తక్కువగా వ్యవసాయ భూమి కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారు కులం, ఆదాయం, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, రేషన్, ఎస్‌బీఐ అకౌంట్, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కొత్తపల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంఈఓ ఆంజనేయులు అన్నారు. మండలంలోని నిడ్జింత ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంతకుముందు స్టోర్ రూంలోని కూరగాయలు, బియ్యం, ఆహార పదార్థాల నాణ్యతను చూశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అనిల్ కుమార్

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి



దమగ్నాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నర్సింహారెడ్డి

మద్దూరు: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో నిర్దేశ లక్ష్యం మేరకు నర్సరీల్లో మొక్కలను పెంచాలని ఎంపీడీఓ నర్సింహారెడ్డి అన్నారు. దమగ్నాపూర్ నర్సరీలో శుక్రవారం బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం దమగ్నాపూర్, దోరెపల్లి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల ఆహారం నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. జాజాపూర్, పేరపళ్ల పాఠశాలల విద్యార్థులు తమ నృత్యాలతో ఆకట్టుకున్నారు. కొండరు పాటలు పాడారు. మరికొందరు ఏకపాత్రాభినయం, ఉపన్యాసాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఈఓ పాల్గొని విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాశ్, ఏఎంఓ విద్యాసాగర్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు



బహుమతులను అందజేస్తున్న శివకుమార్‌రెడ్డి

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో చిట్టెం నర్సిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నీలో ప్రతిభ చాటిన జట్లకు శుక్రవారం డీసీసీ మాజీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన అమర్ జవాన్ జట్టుకు రూ. 30 వేలు, రన్నర్‌గా నిలిచిన సూపర్ సిక్సర్స్ జట్టుకు రూ. 20వేల నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులకు కొత్త మైదానం ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, గందె చంద్రకాంత్, సలీంగౌడ్, సాయిబాబా, సూర్యమోహన్, బసపురం వెంకట్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్ల మధుసూదన్‌రెడ్డి, వెంకగౌడ్ పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న భీష్మ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్

దామరగిద్ద: మండల కేంద్రంలోని మైసమ్మ ఆలయ అభివృద్ధి నిమిత్తం శుక్రవారం భీష్మ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్ రూ. 50వేల విరాళం ఇచ్చారు. ఈ మేరకు మాజీ ఎంపీపీ నర్సప్ప సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.గుజప్ప, ఆనంద్, ఈరప్ప, హన్మంతు, వెంకటప్ప, వీరప్ప, ప్రవీణ్, విజయ్, భీంశప్ప, పాండేషన్ సభ్యులు తిప్పణ్ణ, బాలాజీ, గోపాల్, సుదర్శన్ రెడ్డి, వెంకటేష్, శివరాజ్, శ్రీనివాస్, నర్సింహా, సంతోష్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం తగదు

నారాయణపేట టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల మేరకు రైతుభరోసా, రుణమాఫీ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని షహీద్ భగత్‌సింగ్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఏఐయూకేఎస్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరయ్యారు. రైతు సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. రైతులందరికీ పంట రుణాలు మాఫీ చేయడంతో పాటు కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు వేగంగా పావులు కదుపుతోందని ఆయన విమర్శించారు. రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం రైతుల సమస్యలపై ఈ నెల 9న నిర్వహించే డిమాండ్ డేకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాము, సహాయ కార్యదర్శి సీహెచ్ రాంచందర్, యాదగిరి, రాజన్న, వెంకటయ్య, కొండా రెడ్డి, చిన్నారెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి పాటుపడాలి

కోస్గి: రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటుందని.. నూతనంగా నియమించబడిన ఆలయ ధర్మకర్తల మండలి ప్రతినిధులు ప్రభుత్వ సహకారంతో ఆలయాలను మరింత అభివృద్ధి చేయాలని కడా ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్తల మండలి, మహేదేవుని ఆలయ ధర్మకర్తల మండలి ప్రతినిధుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఆలయాలకు నోచుకోని పురాతన ఆలయాల అభివృద్ధి కోసం ధర్మకర్తల మండలీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం వేణుగోపాల స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కృష్ణమూర్తి, సభ్యులుగా తమ్మలి రత్నమాల, మేడి వెంకటయ్య, పీరంపల్లి రఘు రాములు, బిల్లె అంజిలయ్య, ఆలయ పూజారిగా జయతీర్థాచారి ప్రమాణం చేశారు. మహాదేవుని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ముజ్జిగ సోమశేఖర్, సభ్యులుగా వేపూర్ వెంకటరాములు, మన్నె రమేష్, బల్లె వెంకటయ్య, పుట్టి నాగప్ప, పూజారిగా మఠం విశ్వనాథస్వామి ప్రమాణం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, మున్సిపల్ చైర్పర్సన్ అన్నపూర్ణ, మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, నాయకులు నాగులపల్లి నరేందర్, బెజ్జు రాములు, తుడుం శ్రీనివాస్, మన్సూర్ శ్రీను, రాన్సూం బాలరాజ్, మ్యాకల రాజేష్, కోడగంటి హరి తదితరులు పాల్గొన్నారు.



ఆలయాల ధర్మకర్తల మండలి ప్రతినిధులతో అధికారులు, నాయకులు

ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు

నారాయణపేట: జిల్లాలోని పలు శాఖల అధికారులు తమ సొంత వాహనాలను వినియోగించుకుంటూ ప్రభుత్వం నుంచి రూ. 33వేల చొప్పున అద్దె పొందుతున్నారని శుక్రవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో జరిగిన ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేసినట్లు ఉమ్మడి జిల్లా ఆల్ వెహికిల్స్ యూనియన్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖాదర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రజాదర్బార్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం చిన్నారెడ్డికి విన్నవించగా.. వెంటనే ఈ విషయంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు పంపించినట్లు పేర్కొన్నారు.

గ్రంథాలయం అందుబాటులోకి వచ్చేనా?

అమరచింత మున్సిపాలిటీగా మారినా తెరుచుకోని వైనం



అమరచింతలో నిరుపయోగంగా ఉన్న గ్రంథాలయం

అమరచింత: పట్టణంలోని గ్రంథాలయం కొన్నేళ్ల క్రితం నిర్వహణ భారంతో మూతపడింది. అమరచింత గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు కొందరు యువకులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి గ్రంథాలయ పునరుద్ధరణ కోసం విరాళాలు సేకరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ గదిని కేటాయించి, ప్రతినెలా దినపత్రికలతో పాటు విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. దాతల సహకారంతో కుర్చీలు, టేబుల్‌లను సమకూర్చారు. గ్రంథాలయ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించే వ్యక్తికి గౌరవ వేతనం ఇచ్చే వీలును కల్పించారు. కొన్నేళ్లుగా ప్రస్తుతం దాతలు ముందుకు రాకపోవడంతో నిర్వహణ భారమై గ్రంథాలయం మూతపడింది. మున్సిపాలిటీగా మారిన అమరచింతలో గ్రంథాలయ పునరుద్ధరణను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రంథాలయం ఎప్పుడు తెరుస్తారోనని పాఠకులు, యువత ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. అమరచింత మున్సిపాలిటీగా మారిన తర్వాత గ్రంథాలయానికి పూర్వపు భవనమున్నదని అసంపూర్తి ప్రజలకు నిరాశ మిగిలింది. గ్రంథాలయానికి కేటాయించిన భవనం తలుపు ధ్వంసం కావడంతో పర్నిచర్‌కు రక్షణ కరువైంది. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం స్పందించి గ్రంథాలయం పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.